క్లుప్తంగా

మరమ్మతులు చేయాలని రోడ్డుపై బైఠాయింపు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామం ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఎస్పీ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గుంతల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డును పరిశీలిస్తే బంగారు తెలంగాణ కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. ధర్నాలో కొంకటి శేఖర్, ఇరుగురాల రమేశ్, దీకొండ వద్యాసాగర్, అరీఫ్, ఉదయ్, శశికుమార్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హుజూరాబాద్‌రూరల్: మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ అన్నారు. గురువారం పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సరైన పత్రాలులేని పది ద్విచక్ర వాహనాలను జరిమానా వేశారు. తనిఖీల్లో ఎస్‌ఐ రాజన్న పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే భూమి రిజిస్ట్రేషన్

శంకరపట్నం: మండలంలోని చింతగుట్ట గ్రామానికి చెందిన ఆడెపు సదయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం వ్యవసాయ భూమిని ఆడెపు సరోజన, బాకారపు కుమార్‌కు విక్రయించాడు. భూ రిజిస్ట్రేషన్ కోసం అంబులెన్స్‌లో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా నడవలేని స్థితిలో ఉన్న రైతు వద్దకే తహసీల్దార్ శ్రీనివాస్‌రావు వచ్చి అంబులెన్స్‌లోనే భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర: ఖేలో కరీంనగర్ జీతో కరీంనగర్ ఆటల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి ఆవిష్కరించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలకు చెందిన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఏడో తేదీలోపు పార్లమెంట్ ఆఫీసులో ఆధార్ కార్డుతో వచ్చి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండ రమణారెడ్డి, వైద రామానుజం, ఉప్పు రామకృష్ణ, రేగులపల్లి రమణారెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, రెండ్ల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పూర్తి చేయాలి

శంకరపట్నం: బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ సూచించారు. శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రోడ్డు నిర్మాణంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని తాడికల్, అంబాల్‌పూర్, కేశవపట్నం, మొలంగూర్, గొల్లపల్లి, కొత్తగట్టు గ్రామాల్లో వ్యవసాయభూములు, బావులు, ఇళ్లు, బోర్లు, వృక్షాలు కోల్పోతున్న యజమానులు, ప్రభుత్వం అందిస్తున్న పరిహారం తీసుకోవాలన్నారు. సమ స్యలున్న రైతులతో మాట్లాడాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐలు అరుణ, లక్ష్మారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీలత ఉన్నారు.

చెట్ల తొలగింపుపై నాయకుల ఆందోళన

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ గ్రామ పంచాయతీ పరిధి ఎల్‌ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ స్థలంలో భారీ వృక్షాలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తొలగింపజేస్తున్నారని ఆరోపిస్తూ బీఎస్పీ, బీజేపీ నాయకులు గురువారం ఆందోళన చేశారు. 6న ఎల్‌ఎండీ కాలనీలో నిర్వహించే మహిళా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లలో వృక్షాలు తొలగిస్తుండటంతో నిరసన తెలిపారు. సంఘటన స్థలానికి తిమ్మాపూర్ సీఐ రమేష్, ఎస్సై ప్రమోద్‌రెడ్డి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. నిరసనలో బీజేపీ మండల అధ్యక్షుడు జగదీశ్వరాచారి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం, నాయకులు అరుణ్, రవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- పెండింగ్ బిల్లులు ఇప్పించాలని సర్పంచుల డిమాండ్
- సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు



సర్వసభ్య సమావేశంలో బిల్లులు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరుతున్న సర్పంచులు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

చిగురుమామిడి: ఈజీఎస్, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించిన పనులు పూర్తి చేసి ఏడాది గడుస్తున్నా బిల్లులు రావడంలేదని మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆరోపించారు. గురువారం ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన నిర్వహించిన మండల సభకు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్ బిల్లుల రిపోర్టు సబ్‌మిట్ చేయాలని, తప్పనిసరిగా పెండింగ్ బిల్లులు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో సర్పంచులు ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కోటా నుంచి చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు రూ. 2.50 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో కమ్యూనిటీహాల్స్ పెండింగ్ పనులకు తగిన ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో కసరత్తు చేయాలని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జెడ్పీటీసీ గీకురు రవీందర్ మాట్లాడుతూ.. ఇందుర్తి, సుందరగిరి, బొమ్మనపల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలకు ముగ్గు పోసినా సంబంధిత ఏఈ కాంట్రాక్టర్‌తో పనులు చేయించడంలేదని ఆరోపించారు. డీఈఈ రవిప్రసాద్ మాట్లాడుతూ.. వారంలో పనులు ప్రారంభించకుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానడటంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది.

ఎమ్మెల్యే సమక్షంలోనే అధికారుల నిలదీత

అధికారులు, సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ కొనసాగింది. ఏకంగా ఎమ్మెల్యే సమక్షంలోనే అధికారుల వైఖరిని సభ్యులు తప్పుబట్టారు. ఓవర్‌లోడ్‌తో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సుందరగిరి, సర్పంచ్ రమేశ్, బొమ్మనపల్లి ఎంపీటీసీ మల్లేశం అన్నారు. సంబంధిత ఏఈ రాజిరెడ్డి స్పందిస్తూ ఉల్లంపల్లి, బొమ్మనపల్లి, సుందరగిరి గ్రామాల్లో ఓవర్‌లోడ్ ఉందని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి మూడు గ్రామాలకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చిగురుమామిడి, చిన్నముల్కనూర్ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్ల కోసం రూ.2.50 లక్షల డీడీలు చెల్లించినా స్తంభాలు పాతి వైర్లు బిగించడంలేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు బెజ్జంకి లక్ష్మణ్, వెంకటనర్సింహారెడ్డి ఆరోపించారు. సమస్య తన పరిధిలో లేదని గత ఏఈ పీరియడ్‌లో జరిగిందని, ఆయన మెడికల్ లీవ్‌లో ఉన్నాడని ఏఈ బదులిచ్చినా సభ్యులు వినలేదు. మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క ట్యాంకు నిండటంలేదని ప్రజలకు నీరు అందించలేకపోతున్నామని రేకొండ సర్పంచ్ పిట్టల రజిత సభలో ప్రస్తావించారు. తమ గ్రామాలకు ఆదాయం తక్కువగా ఉందని కరెంటు బిల్లులు కట్టలేకపోతున్నామని చిన్నగ్రామాలకు ఫ్రీగా కరెంటు ఇవ్వాలని సర్పంచులు బోయిని శ్రీనివాస్, చెప్యాల మమత, పలువురు ఆరోపించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఇందుర్తి ప్రాథమిక పాఠశాలలో అటెండర్ లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, మన ఊరు మనబడి కార్యక్రమ సమాచారం ఇవ్వలేదని ఎంపీటీసీ అందె స్వప్న, కొండాపూర్ కాశవాడకు మిషన్‌భగీరథ నీరు సరిగా రావడంలేదని సర్పంచ్ భవాని సభలో పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్ ముబీన్‌అహ్మద్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనితిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రజితకృష్ణమాచారి, సింగిల్ విండోచైర్మన్ వెంకటరమణారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గది ప్రారంభం

మండలంలోని సీతారాంపూర్ ప్రాథమిక పాఠశాలలో రూ.11.80 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నిర్మించిన పాల ఉత్పత్తిదారుల నూతన భవనం ప్రారంభోత్సవంలో చైర్మన్ రాజేశ్వర్‌రావ్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాపురెడ్డి, ఎంపీటీసీ రాజిరెడ్డి, ఎంపీపీ వినీత, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 24/7ఏఐ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ తెలిపారు. 263 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారని కంపెనీ హెచ్‌ఆర్ నరేందర్ ఇంటర్వ్యూ నిర్వహించి 81 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. అనంతరం ఉద్యోగ నియామక జాబితాను కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌కు అందజేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రవీంద్రబాబు వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్లికేషన్‌లపై అవగాహన కలిగి ఉడాలి

విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్, వివిధ డొమైన్లలో అప్లికేషన్‌ల గురించి లోతైన అవగాహన అందించడం లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్లాలని ప్రోగ్రాం నిపుణుడు బి.విజయ్ సూచించారు. కళాశాలలోని తృతీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం మార్చి 1 నుంచి 5 వరకు పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నామని కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ప్రయోగాత్మక విద్యను అందిపుచ్చుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ముందుకు సాగుతూ వర్క్‌షాప్‌ను ఉపయోగించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పైథాన్ ప్రోగ్రామింగ్‌పై ఆసక్తి ఉన్న అన్ని శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ ప్రారంభించి పైథాన్ విశిష్టతను వివరించారు. ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వొడితెల ఇంద్రనీల్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కల్లెం రవీంద్రబాబు, వర్క్‌షాప్ సమన్వయకర్తలు సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి. ప్రశాంత్ కుమార్, ఇ.ప్రదీప్ ఉన్నారు.

వంటగ్యాస్ ధరల పెంపుపై నిరసనలు



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించకపోతే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని తెలంగాణ సాంస్కృతిక చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, రాస్తారోకో చేశారు. కట్టెల పొయ్యిపై వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, ఎంపీపీ సులోచన, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: వంటగ్యాస్ ధరలు పెంచి నిరుపేదలపై కేంద్ర ప్రభుత్వం మోయలేని భారం మోపుతుందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి పిలుపు మేరకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నల్ల జెండాలతో ధర్నా, నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలశ్రీనివాస్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం జోన్ కార్యదర్శి శీలం అశోక్, కొప్పుల శంకర్ మోదీ పాలనలో సామన్యుడు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జోన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులకు ప్రతిగా బీజేపీ నాయకులు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాపిరెడ్డి, కలిగేటి లక్ష్మణ్, లంక మల్లేశం, అరపెల్లి ప్రశాంత్, శారద పాల్గొన్నారు.

చొప్పదండి: సిలిండర్‌పై కేంద్రం రూ. 50 అదనపు భారం వేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు రాస్తారోకో నిర్వహించారు.

లక్ష్మాజిపల్లిలో కంటి వెలుగు శిబిరం



కంటివెలుగు శిబిరంలో సర్పంచ్ రావుల రమేశ్

ఇల్లందకుంట: మండలంలోని లక్ష్మాజిపల్లి గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ అంతం ఎల్లారెడ్డి ప్రారంభించారు. వారం రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని, కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి తులసీదాస్, క్యాంపు ఇన్‌చార్జి డా. శ్రీదేవి, కంటి వైద్యురాలు అనిత, హెల్త్ అసిస్టెంట్ దామోదర్, పంచాయతీ కార్యదర్శి తారకరామారావు, ఆరెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాపూర్: దృష్టిలోపాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండిన వారు సద్వినియోగం చేసుకోవాలని తిమ్మాపూర్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, నుస్తులాపూర్ సర్పంచ్ రావులరమేశ్ అన్నారు. గురువారం గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కంప్యూటరైజ్డ్ పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి మండలపరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాజోద్దీన్, వార్డుసభ్యులు పద్మ, రేఖ, లావణ్య, గట్టయ్య, రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు



ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హామీ ఇచ్చారు. గురువారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మిషన్ భగీరథ నీరు అందిస్తామని, సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పది జీపీఏ సాధించాలని సూచించారు. మల్లన్నపల్లికి చెందిన విద్యార్థిని వైద్య సీటు పొందడం పట్ల అభినందించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు మండలంలోని రాగంపేటలో పొద్దు పొడుపులో భాగంగా పదకొండు మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఇళ్లకు వెళ్లి అందించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో స్వరూప, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


ఫీల్డ్ విజిట్

స్పేస్ సెంటర్‌ను సందర్శించిన విద్యార్థులు



మానకొండూర్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట ఇస్రో స్పేస్ సెంటర్, మ్యూజియంను సందర్శించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇస్రోవారు మోడల్ స్కూల్‌కు చెందిన 26 మందిని ఇటీవల ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని, టీచర్లు, పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో శోధ 2 కే 23



శివదయాల్‌ను సన్మానిస్తున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జాతీయ స్థాయి టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్ శోధ 2 కే 23 కార్యక్రమం నిర్వహించామని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త శివదయాలు ప్రారంభించారని, డీఆర్‌డీఎల్ రూపొందించిన పరికరాలు దేశ రక్షణకు ఎంతో తోడ్పడుతున్నాయని అన్నారు. అనంతరం అతిథిని కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజు శాలువాతో సత్కరించి అభినందించారు అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సంక్షిప్త వార్తలు

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

వీణవంక: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే, క్రీడా సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ రాజిరెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ... రాబోయే పరీక్షల్లో ప్రతిభ కనబర్చి కళాశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

వీణవంక: ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సాధిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన రైతు బండారి వెంకటరాజు వ్యవసాయ ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముసిపట్ల తిరుపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. ఒకేరకం పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

మానకొండూర్: మానకొండూర్‌లో శుక్రవారం నిర్వహించే రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్ పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలను కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించేందుకు రేవంత్‌రెడ్డి యాత్ర చేపట్టారని అన్నారు. తిమ్మాపూర్ మండలం పోలంపల్లి నుంచి మల్లాపూర్, మన్నెంపల్లి, పొరండ్ల, ముంజంపల్లి, మీదుగా మానకొండూర్ వరకు పాదయాత్ర ఉంటుందన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు

హుజూరాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా గురువారం పట్టణంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్‌ను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌కు వెళ్లకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం వదిలిపెట్టారు.

దళితబంధు హామీ నెరవేర్చాలి

హుజూరాబాద్‌రూరల్: ప్రతి దళిత కుటుంబానికి ఇస్తానన్న దళితబంధు హామీని నెరవేర్చాలని కోరుతూ దళితబంధు సమన్వయ కమిటీ చైర్మన్ కొత్తూరి రమేశ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట దళితులు ఆందోళన చేపట్టారు. రేషన్‌కార్డు లేని పథకం అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

క్రైం కార్నర్

బైక్ పైనుంచి పడి కండక్టర్ మృతి

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన కండక్టర్ ఆనందరాములు (52) బైక్ అదుపుతప్పడంతో కింద పడి మృతి చెందాడు. కరీంనగర్ ఆర్టీసీ 2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తు ఆనందరాములు గురువారం మండలంలోని ఊటూరు గ్రామంలోని ఓ కార్యక్రమానికి వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా ఊటూరు శివారులోనే ప్రమాదానికి గురయ్యాడు, తలకు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, భార్య ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మృతి

వీణవంక: మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు ముదిగంటి శ్రీకాంత్(39) అప్పుల బాధతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు తనకున్న మూడెకరాలతో పాటు మరో తొమ్మిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. చేను ఏపుగా పెరిగినా చీడ పురుగులు ఆశించాయి. నివారణకు పురుగుల మందులు పిచుకారీ చేసిన ఫలితం లేకపోవడంతో సుమారు రూ. 8లక్షల వరకు అప్పులయ్యాయనే మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కలవారు గమనించి కరీంగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతుడి తల్లి ముదిగంటి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇసుక తవ్వకాలపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

వీణవంక: అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంది సురేందర్‌రెడ్డి గురువారం మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని పలు గ్రామాల శివారులోని మానేరు వాగులో ఇసుక తవ్వకాలపై ఆధారాలను హెచ్ఆర్సీకి నివేదించినట్లు తెలిపారు. ఇసుక తవ్వకాలపై ప్రశ్నించినందుకు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, విచారణ జరపాలని కోరానని వివరించారు.

బ్యాంక్ ఎదుట అగ్ని ప్రమాదం

జమ్మికుంట: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌ను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న టీస్టాల్ యాజమాని బ్యాంక్ అధికారులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది బ్యాంక్ ప్రధాన గేటు వైపు మంటలు వ్యాపించకుండావారు అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంటలు ఎలా వ్యాపించాయి అనే విషయం తెలియడం లేదని అధికారులు, స్థానికులు ఆందోళన చెందారు. ఈవిషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అదనపు కట్నం కోసం వేధించిన భర్త, అత్తింటివారిపై కేసు నమోదు

శంకరపట్నం: అదనపు కట్నం కోసం వేధించిన భర్త, అత్తింటి వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని ముత్తారంకు చెందిన స్వప్నకు కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన ఆదుర్తి సాగర్‌తో 2021లో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.3 లక్షల కట్నం, కానుకలు అప్పగించారు. ఆరునెలల నుంచి అదనంగా పదిలక్షల కట్నం తేవాలంటూ భర్త సాగర్, అత్తమామలు, ఆడపడుచులు వేధిస్తుండటంతో నాలుగు నెలలుగా పుట్టింటిలోనే ఉంటుందని, స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులోని కాకతీయ కాలువ నుంచి మొరం, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సారెస్పీ అధికారులు డీఈ సమ్మయ్య, ఏఈ కాలిదాస్ ఏడు ట్రాక్టర్లను, జేసీబీని పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఆర్ఐ సత్యనారాయణకు సమాచారం అందించారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఎగుర్ల పాపవ్వ కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రామడుగు పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం పొయ్యి వెలిగిస్తుండగ అగ్ని ప్రమాదానికి గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్ తరలించగ గురువారం ఉదయం మృతి చెందిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుమని వివరించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా సుదర్శన హోమం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ సుదర్శన హోమం వేదపండితులు సుమంత్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేందర్‌రావు, ఎంపీడీవో రాజీమ్‌ల్‌ఖాత్రా, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, రైతుబంధు సమితి కన్వీనర్ లచిరెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, కళ్యాణోత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం విశ్వక్సేనారాధారణ, పుణ్యాహవచనం, రక్షాబంధనం కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు, దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, సర్పంచ్ వీర్ల సరోజనలతో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్తారంలో బోనాల జాతర

శంకరపట్నం: మండలంలోని ముత్తారంలో గురువారం పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనంతో గ్రామంలోని వీధులగుండా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు సమర్పించారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో పశ్చిమాభిముఖుడై భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సర్పంచు అలువాల నాగలక్ష్మి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొదటిరోజు గురువారం స్వామివారి ఆలయ ప్రవేశంతో ఉత్సవాలు మొదలయ్యాయని, ప్రతిరోజు శివరామకృష్ణ భజన మండలి, సత్యసాయి యోగా మండలి, దేవి ఉత్సవ కమిటీ గర్శకుర్తి వారి భజన కార్యక్రమాలుంటాయని, స్వామివారి కల్యాణం రోజు అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయానికి రూ. 51 వేల విరాళం

చొప్పదండి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి పట్టణానికి చెందిన కర్ర వ్యాపారి చీకట్ల లచ్చయ్య, రాజేశ్వరి దంపతులు గురువారం రూ. 51,116 ఆలయ చైర్మన్ గుర్రం రాజేశ్వర్‌రెడ్డికి విరాళంగా అందజేశారు. 6 నుంచి 9 వరకు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని రాజేశ్వర్‌రెడ్డికోరారు. ఆలయ నిర్వాహక ట్రస్టు సభ్యులు లింగయ్య, రాము, ఇంద్రసేనారెడ్డి, మహేశ్, కొల్లూరి ఆనందం, మల్లారెడ్డి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఆలయ వార్షికోత్సవం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు అవధానుల దత్తాత్రేయశర్మ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాద వితరణ, భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ వెంపటి సదానందం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.